క్లుప్తంగా

నేడు అల్పాదాయ సభ్యుల ఆర్థిక సాయానికి ఇంటర్వ్యూలు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి సర్కిల్ 24 పట్టణ ప్రాంతంలో నివసించే వారు మంగళవారం (4వ తేదీ) తెలంగాణ మైనార్టీ అల్పాదాయ సభ్యులకు ఆర్థిక సహాయం అందించేందుకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు డిప్యూటీ కమిషనర్ రవికుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. హెచ్‌ఎంటీ హిల్స్ కమ్యూనిటీహాలులో ఈ ఇంటర్వ్యూలు ఉంటాయని తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న వారు ఎక్నాలెడ్జ్‌మెంట్, ఆదాయ ధ్రువీకరణ పత్రం, 2 ఫొటోలు, సంబంధిత ధృవపత్రాలతో ఉదయం 10.30గంటలకు హాజరు కావాలని కోరారు. కూకట్‌పల్లి, వివేకానందనగర్, హైదర్‌నగర్, ఆల్విన్‌కాలనీ డివిజన్లకు చెందిన అభ్యర్థులు మాత్రమే హాజరు కావాలని సూచించారు.

ఆల్విన్‌కాలనీ ఫేజ్-2 అధ్యక్షుడిగా కృష్ణారావు



ఆల్విన్‌కాలనీ ఫేజ్-2 నూతన కమిటీకి అభినందనలు తెలుపుతున్న ఎమ్మెల్యే గాంధీ

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ ఫేజ్–2 సంక్షేమ సంఘం ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో రెండోసారి భారీ మెజార్టీతో ఎం.కృష్ణారావు అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా వెంకట్రావు, జనరల్ సెక్రటరీగా కట్ట శ్రీనివాస్‌రావు, జాయింట్ సెక్రటరీగా స్వరాజ్యం కల్చరల్ సెక్రటరీగా కొండారెడ్డి, ట్రెజరర్ వెంకటేశ్వర్లు, కమిటి సభ్యులుగా బాలాజీ, శ్రీనివాస్, నరసింహారావు, సునీత, సూర్య వంశీ గెలుపొందారు. ఈ సందర్భంగా సోమవారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, స్థానిక కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌లు వీరిని సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు కృష్ణారావు మాట్లాడుతూ.. కాలనీవాసులు తనపై నమ్మకం ఉంచి రెండు దఫాలుగా ఎన్నుకున్నందుకు కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు.

జీఎస్‌ఆర్‌నగర్ అధ్యక్షుడిగా లింగయ్య



జీఎస్‌ఆర్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి సర్కిల్ ఆల్విన్‌కాలనీ జీఎస్‌ఆర్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా జి. లింగయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం నిర్వహించిన సంక్షేమ సంఘం సమావేశంలో నూతన కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా మాణిక్యరెడ్డి, వి. భాస్కర్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీగా సీహెచ్ సురేష్, ట్రెజరర్‌గా సాయి ప్రభాకర్, కల్చరల్ సెక్రటరీగా శశిధర్, లీగల్ సెక్రటరీగా శివరాం రెడ్డి, కమిటీ మెంబర్లుగా గోపాల్‌రెడ్డి, నగేష్‌గౌడ్, చంద్రశేఖర్, ఎండీ పాషా, రవీందర్ ఉన్నారు. కాలనీ వాసులందరినీ కలుపుకొని ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్‌లతో ఎప్పటికప్పుడు సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే దిశగా కృషి చేస్తానని అధ్యక్షుడు తెలిపారు.

నాణ్యత ప్రమాణాలతో రోడ్డు పనులు పూర్తి చేయాలి



వివేకానందనగర్ రోడ్‌నం.3లో సీసీరోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సబిహ

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్‌లోని వివేకానందనగర్ రోడ్డు నం.3లో నిర్మిస్తున్న సీసీరోడ్డు పనులను సోమవారం కార్పొరేటర్ సబిహా బేగం పరిశీలించారు. పనులను నాణ్యత ప్రమాణాలతో త్వరగా పూర్తి చేయాలని సూచించారు. స్థానికులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ వినాయకరావు, ప్రధాన కార్యదర్శి పిల్లి తిరుపతి, జగన్, రవీందర్‌రెడ్డి, యోగి రాజు, చారి, లక్ష్మి తదితరుల పాల్గొన్నారు.

దరఖాస్తులను పరిష్కరించాలి

జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి .

సాక్షి,మేడ్చల్ జిల్లా : ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలందించిన 97 ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి ఆదేశించారు. సోమవారం జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలపై ప్రజావాణిలో రాత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ప్రజావాణికి గతంలో వచ్చినా అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా పరిశీలన చేసి పరిష్కరించాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ లిగ్యానాయక్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రైతు సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు
- బోయిన్ చెరువు కట్ట వద్ద కొమురయ్య విగ్రహావిష్కరణ
- విగ్రహం ఏర్పాటు చేసిన వారిని సన్మానించిన ఎమ్మెల్యే



అంజయ్యనగర్ బోయిన్ చెరువు కట్ట వద్ద ఏర్పాటు చేసిన దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ నర్సింహయాదవ్

ఓల్డ్ బోయిన్‌పల్లి: రైతాంగ సాయుధ పోరాటాన్ని పతాక స్థాయికి తీసుకెళ్లిన వీరుడు దొడ్డి కొమురయ్య అని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కొనియాడారు. సోమవారం దొడ్డి కొమురయ్య జయంతి ఉత్సవాలలో భాగంగా ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ అంజయ్యనగర్ వాసులు ఏర్పాటు చేసిన దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్, మాజీ కౌన్సిలర్ మక్కాల నర్సింగ్‌రావుతో కలసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొమరయ్య విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

- అనంతరం ఆయన మాట్లాడుతూ.. పెత్తందారి వ్యవస్థపై తిరగబడ్డ యోధుడు పిడికిలెత్తిన 19 ఏళ్ల యువ కెరటం దొడ్డి కొమురయ్య అని కొనియాడారు. ఎప్పటికీ మరువదు నీ అమరత్వం తెలంగాణ ప్రజానీకమన్నారు. చిన్న తనంలోనే సాయుధ పోరాటం చేసి దొరల గడీలను కూల్చిన ధీశాలని గుర్తు చేశారు. ఆయన పోరాట పటిమను తెలంగాణ ప్రజానీకం మరింత తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.
- దొడ్డి కొమురయ్య విగ్రహం ఏర్పాటు చేసిన నిర్వాహకులు గొల్ల, కురమ సంఘం నాయకులు కనకరాజుయాదవ్, దయ్యాల మల్లేష్, సాయిల్లా ఐలేష్, లింగం, పోచయ్య, అద్దాల శ్రీనివాస్, రాజయ్య, సంపత్, బెల్లం ఐల్లయ్య, సంతోష్ యాదవ, బండారి తిరుపతి, సమ్మయ్య, శ్రీను, యాదగిరి, మొగిలి, రవి, పరకుమార్ తదితరులకు గొంగడి కప్పి వారు సన్మానించారు.
- ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు కర్రె జంగయ్య, ఎజాజ్, మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ మన్నె ఉదయ్‌యాదవ్, అంజీ, నర్సింగ్‌రావు, మక్కాల సత్యనారాయణ, ప్రకాశ్,ఎనుగుల తిరుపతి, దండుగుల యాదగిరి, బాల్‌రాజు, బాలరాం, చిన్న తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే, కార్పొరేటర్‌కు గొంగలి కప్పి సన్మానిస్తున్న నిర్వాహకులు

మౌలిక సదుపాయాల కల్పనలో రాజీ పడం

బాలానగర్: ఫతేనగర్ డివిజన్‌లో రూ.2.04కోట్ల నిధులతో చేపట్టిన సీసీరోడ్డు పునరుద్ధరణ పనులను సోమవారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు మౌలిక సదుపాయాలు అందించే విషయంలో ఎక్కడా రాజీ పడేది లేదన్నారు. ఇప్పటికే కూకట్‌పల్లి నియోజకవర్గం ఆదర్శ నియోజకవర్గంగా మారిందన్నారు. అదే విధంగా ఫతేనగర్ డివిజన్‌లోని కొన్ని ప్రాంతాల్లో డ్రైనేజీ సమస్యలు ఉన్నాయని వాటిని కూడా త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. దానికి సంబంధించిన ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయన్నారు. భవిష్యత్‌లో ఎటువంటి ఇబ్బందులు లేకుండా భూగర్భ నీటి పైపులైన్లు వేస్తున్నామని తెలిపారు. పనులు జరుగుతున్న కారణంగా కొద్దిగా నీటి సమస్య ఏర్పడే అవకాశం ఉందన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేష్‌మాదిగ



బీజేపీ కార్యాలయం ఎదుట ధర్నా చేసి బీజేపీ జిల్లా కార్యదర్శి పప్పు పటేల్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మార్పీస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేష్‌మాదిగ

కూకట్‌పల్లి: పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించకుండా మాదిగలకు ఇచ్చిన మాటను విస్మరించి నమ్మకద్రోహిగా బీజేపీ చరిత్రలో నిలిచిపోకుండా చూసుకోవాలని ఎమ్మార్పీస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేష్ మాదిగ అన్నారు. బడ్జెట్ పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న సందర్భంగా ఎస్సీ వర్గీకరణ మీద బీజేపీ చేస్తున్న నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ బీజేపీ కార్యాలయం ముందు మహా ధర్నాను సోమవారం నిర్వహించారు. అనంతరం బీజేపీ జిల్లా కార్యదర్శి పప్పు పటేల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎస్‌ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు తోకల చిరంజీవి మాదిగ ఆధ్వర్యంలో జరిగిన ఈ ధర్నాలో పాల్గొన్న గోవిందు నరేష్ మాదిగ మాట్లాడారు.

◆ బిల్లు ఎందుకు తీసుకురావడం లేదు..

అగ్రకులాల్లోని పేదలకు రిజర్వేషన్లు ఇవ్వడానికి పార్లమెంట్‌లో బిల్లు తీసుకొచ్చిన బీజేపీ ఎస్సీ వర్గీకరణ చేసి మాదిగలకు తగినంత రిజర్వేషన్లు ఇవ్వడానికి పార్లమెంట్‌లో బిల్లు ఎందుకు తీసుకురావడం లేదని ప్రశ్నించారు. మాదిగల ఎస్సీ వర్గీకరణ న్యాయం చేస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పారన్నారు. ఎమ్మార్పీఎస్ ఉద్యమానికి 29 ఏళ్లుగా మద్దతు ఇచ్చారని గుర్తు చేశారు. మాట ఇచ్చిన వారిని మోసం చేశారని విమర్శించారు. కావాలనుకున్న వారికి న్యాయం చేశారని అన్నారు.

◆ వర్గీకరణ చేయకపోతే మాదిగలు బీజేపీకి దూరమవుతారు..

ఎస్సీ వర్గీకరణ చేయకపోతే తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన మాదిగలు బీజేపీకి శాశ్వతంగా దూరమవుతారని హెచ్చరించారు. మాదిగలను మోసం చేయడాన్ని తెలంగాణ రాష్ట్రంలోని అన్ని కులాల ప్రజలు కూడా గమనిస్తున్నారని అన్నారు. ఇది బీజేపీ రాజకీయ పతనానికి దారి తీస్తుందన్నారు. వెంటనే బడ్జెట్ పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఎం.ప్రణీత్ మాదిగ, మేడ్చల్ జిల్లా కన్వీనర్ పి.ప్రణయ్ మాదిగ, కో–కన్వీనర్ వి. శివమాదిగ, బి. స్వామిమాదిగ, బి.శంకర్‌మాదిగ, ఎస్. శ్రీనివాస్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

సాక్షి,మేడ్చల్ జిల్లా: ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగా బీసీ అభివృద్ధి శాఖ అధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను అర్హులైన వారందరికి చేరవేయడంలో బాధ్యతాయుతంగా వ్యవహరిస్తున్నామని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా వెనుకబడిన అభివృద్ధి శాఖ అధికారి టి.ఝాన్సీరాణి తెలిపారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఎలాంటి అక్రమాలకు చోటివ్వకుండా కార్యక్రమాలను నిరంతరంగా కొనసాగిస్తున్నట్లు ఆమె తెలిపారు. కొందరు వ్యక్తులు కావాలని తనపై చేస్తున్న దుష్ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. తనపై ఆరోపణలు చేసిన వారిపై పరువు నష్టం దావా వేయనున్నట్లు తెలిపారు.

దొడ్డి కొమురయ్యకు నివాళి

సాక్షి,మేడ్చల్ జిల్లా: తెలంగాణ పోరాట యోధుడు దొడ్డి కొమరయ్య పోరాటం భావి తరాలకు స్ఫూర్తి దాయకమని జిల్లా రెవెన్యూ అధికారి లింగ్యానాయక్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన దొడ్డి కొమురయ్య 96వ జయంతి సభలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో అమరుడైన దొడ్డి కొమరయ్య జయంతి, వర్ధంతులను అధికారికంగా నిర్వహించడానికి రాష్ట్ర ప్రభుత్వం 2023 ఏప్రిల్ 2న ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. నిజాం నిరంకుశ పాలన, వెట్టి చాకిరీకి వ్యతిరేకంగా సాగిన పోరాటంలో అమరుడైన దొడ్డి కొమురయ్య సేవలను అందరూ స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. సభకు ప్రారంభానికి ముందు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ఝాన్సీరాణితో కలిసి డీఆర్‌ఓ జ్యోతి ప్రజ్వలన చేశారు. దొడ్డి కొమురయ్య చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

సహకారం పెంపొందించుకోవడమే లక్ష్యం

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వ విద్యాలయంను సోమవారం సాయంత్రం రిపబ్లిక్ ఆఫ్ టర్కీ కాన్సులేట్ కాన్సుల్ జనరల్ ఓర్హాన్‌యల్మాన్ ఓకాన్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఉర్దూ యూనివర్శిటీ క్యాంపస్‌లోని పరిపాలనా భవనంలో వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్‌హసన్‌తో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. అకడమిక్ ప్రోగ్రామ్‌లలో టర్కిష్ విశ్వవిద్యాలయాలు, మనూ మధ్య అవగాహన ఒప్పందంపై కాన్సుల్ జనరల్ చర్చించారు. వీసీ ఐనుల్ హసన్ మాట్లాడుతూ సహకారం మరింత పెంపొందించుకోవడమే లక్ష్యమన్నారు.

అంబేడ్కర్ విగ్రహ సుందరీకరణ పనుల పరిశీలన


బాలానగర్: బాలానగర్ డివిజన్ పరిధిలోని ఐడీపీఎల్ కాలనీ ఎదురుగా ఉన్న డా. బీఆర్. అంబేడ్కర్ విగ్రహం సుందరీకరణ పనులను చేపట్టాలని కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి సోమవారం కూకట్‌పల్లి జెడ్‌సీకి వినతి పత్రం అందజేసిన విషయం విదితమే. ఆయన అభ్యర్థన మేరకు సోమవారం ఈఈ గోవర్ధన్‌గౌడ్, ఏఈ రషీద్ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. త్వరగా సుందరీకరణ పనులు పూర్తి చేస్తామని తెలిపారు. అంబేడ్కర్ జయంతిలోపు పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువాలని కార్పొరేటర్ కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు స్వామి గౌడ్, ప్రేమ్‌కుమార్, మహేందర్‌రెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాములు తదితరులు పాల్గొన్నారు.



సుందరీకరణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి, అధికారులు

6న హనుమాన్ జయంతి శోభాయాత్ర


భాగ్యనగర్‌కాలనీ: హనుమాన్ జయంతి సందర్భంగా వీర హనుమాన్ విజయోత్సవ ర్యాలీని ఈనెల 6న నిర్వహించనున్నట్లు విజిత్ వర్మ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ విజయోత్సవ ర్యాలీకి ప్రతి హిందువు హాజరు కావాలని పేర్కొన్నారు. ఈ శోభయాత్ర ఆల్విన్‌కాలనీ, ఎల్లమ్మబండ, హనుమాన్ టెంపుల్ వద్ద మొదలవుతుందన్నారు. సప్తగిరి కాలనీలోని రామాలయం వద్ద ముగుస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం హనుమాన్ దేవాలయంలో అన్నదానం కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా ర్యాలీకి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అల్లూరి రామరాజు, నరేందర్‌రెడ్డి, మణిభూషణ్, ప్రభాకర్ యాదవ్, గాలిపల్లి కమలాకర్‌రెడ్డి, నర్సింగరావు, నవీన్‌గౌడ్, భూపాల్‌రెడ్డి, రాజురెడ్డి, వెంకట్‌రెడ్డి, రఘు, రామకృష్ణ, విజయ్, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



హనుమాన్ విజయోత్సవ ర్యాలీ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న విజిత్ వర్మ

హనుమాన్ రథయాత్ర పోస్టర్ ఆవిష్కరణ

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ ఆర్‌కే సొసైటీ నుంచి బోరబండ బస్‌స్టాప్ వరకు ఈనెల 6వ తేదీ గురువారం హనుమాన్ రథయాత్ర నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం నాయకుడు వేణు పేర్కొన్నారు. సోమవారం ఆర్‌కే సొసైటీలో హనుమాన్ జయంతి రథయాత్ర పోస్టర్‌ను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా పల్లపు వేణు మాట్లాడుతూ.. గురువారం స్థానిక హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆర్‌కే సొసైటీ నుంచి బోరబండ వరకు హనుమాన్ రథయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు, స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో లడ్డుయాదవ్, రాకేష్, రాజు, జాకీర్, భాష, సంతు తదితరులు పాల్గొన్నారు.



రథయాత్రకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పల్లపు వేణు

టెన్త్ మొదటి పరీక్ష ప్రశాంతం



మూసాపేటలో 10వ తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. విద్యార్థులకు 9.30 గంటలకు పరీక్ష ఉండగా అరగంట ముందే పరీక్ష హాలులోకి పంపారు. కేర్ ఫుడ్ పాఠశాలలోని పరీక్షా కేంద్రాన్ని విద్యాధికారి ఆంజనేయులు పరీక్ష ప్రారంభం కాకముందే కేంద్రానికి చేరుకొని పరిశీలించారు. పరీక్ష పూర్తయ్యేంత వరకు విద్యార్థుల తల్లిదండ్రులు పరీక్ష కేంద్రం బయట వేచి ఉన్నారు. – మూసాపేట





గుంట భూమిని కూడా వదలడం లేదు

బీజేపీ రాష్ట్ర నాయకుడు రవికుమార్‌యాదవ్



పాదయాత్రలో భాగంగా ఆల్విన్‌కాలనీ డివిజన్‌లో పర్యటిస్తున్న బీజేపీ రాష్ట్ర రవికుమార్ యాదవ్

ఆల్విన్‌కాలనీ: బీజేపీ రాష్ట్ర నాయకుడు రవికుమార్ యాదవ్ చేపట్టిన చేపట్టిన పాదయాత్ర సోమవారానికి 4వ రోజుకు చేరింది. డివిజన్ పరిధిలోని ధరణినగర్, చక్రధర్‌నగర్, ఆల్విన్‌కాలనీ చివరి బస్‌స్టాప్ వరకు ఈ యాత్ర కొనసాగింది. ఈ సందర్భంగా రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ.. ఆల్విన్‌కాలనీ డివిజన్ బీఆర్‌ఎస్ నాయకులకు కబ్జాలో మొదటి స్థానంలో నిలిచారన్నారు. కాలనీలో డ్రైనేజీ పొంగిపొర్లుతూ దుర్గంధం, దుర్వాసన వెదజల్లుతూ ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని అన్నారు. చిన్నారులకు విషజ్వరాలు వచ్చి ఆసుప్రతి పాలవుతున్నారని తెలిపారు. ప్రభుత్వ స్థలాలు, పార్కు స్థలాలు కనిపిస్తే చాలు అధికార పార్టీ నాయకులు వారి అనుచరులు కబ్జాలు చేస్తున్నారని ఆరోపించారు. ఒక గుంట భూమిని కూడా వదలకుండా కబ్జా చేస్తున్నారని అన్నారు. బీజేపీ పార్టీపై విశ్వాసంతో పార్టీలో అనేక మంది చేరుతున్నానని వారందరికి పార్టీ అండగా ఉంటుందన్నారు. ఈ పాదయాత్రలో చాలా మంది సమస్యలను తమ దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. పాదయాత్రలో జిల్లా ఉపాధ్యక్షుడు రామరాజు, బీజేవైఎం నేషనల్ ఆఫీస్ కోఆర్డినేటర్ కుమార్‌యాదవ్, బీజేవైఎం రాష్ట్ర జనరల్ సెక్రటరీ అరుణ్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు కమలాకర్‌రెడ్డి, నాయకులు నరేందర్‌రెడ్డి, జీఎస్ రాజు తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ పనుల పరిశీలన



డ్రైనేజీ పైపులైన్ల పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు, జలమండలి అధికారులు

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని వెస్టర్న్ హిల్స్ అడ్డగుట్ట సొసైటీ కాలనీలో అత్యవసర పనుల కింద జరుగుతున్న డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ పనులను జలమండలి అధికారులతో కలిసి కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అడ్డగుట్ట డ్రైనేజి లైన్ నిత్యం పొంగుతూ ప్రజలకు ఇబ్బంది కలుగుతోందన్నారు. కాలనీవాసుల అభ్యర్థన మేరకు జలమండలి జీఎం, డీజీఎం, మేనేజర్‌లతో సమావేశం నిర్వహించి ఎమర్జెన్సీ పని కింద డ్రైనేజీ లైన్ పనులను శాంక్షన్ చేయించి పనులను మొదలు పెట్టామన్నారు. హైదర్‌నగర్ డివిజన్‌లో అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని తెలిపారు. అదే విధంగా డ్రైనేజీ పైపులైన్ పనుల్లో జాప్యం లేకుండా త్వరగా సకాలంలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి మేనేజర్ ప్రశాంతి, సూపర్‌వైజర్ నరేంద్ర, కాలనీవాసులు సుబ్బారావు, రాంకుమార్, బీఆర్‌ఎస్ నాయకులు గోపిచంద్, కుమారస్వామి, వెంకటయ్యయాదవ్, సత్యనారాయణ, నక్క శ్రీనివాస్, బ్రహ్మయ్య, రవి మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటికలో ఉద్యానవనం ఏర్పాటు చేస్తాం

కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మబండలోని హిందూ శ్మశానవాటికలో జరుగుతున్న సీసీ రోడ్డు, అభివృద్ధి పనులను సోమవారం కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూ.1.5కోట్ల అంచనా వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేస్తున్నామని పేర్కొన్నారు. శ్మశానవాటిక ప్రహరీ, వాకింగ్ ట్రాక్‌తో పాటు శ్మశానవాటికలో మొక్కలు పెంచి ఉద్యానవనం ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అంతిమయాత్రలో కూడా ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా శ్మశానవాటికలో కావాల్సిన అన్ని వసతులు చేకూర్చుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సమ్మారెడ్డి, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, ప్రదీప్ రెడ్డి, జగదీష్, మల్లేష్, వెంకటేష్, ఫారూఖ్, నాగరాజు, ఏఈ శివప్రసాద్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ తదితరులు

ఫుట్‌పాత్ ఎన్‌క్రోచ్‌మెంట్స్ డ్రైవ్‌ను చేపట్టాలి

- కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ వి.మమత
- 'కమ్యూనిటీ ఎంగేజ్‌మెంట్ – పౌరుల ఫిర్యాదుల పరిష్కారం' కార్యక్రమంపై అవగాహన
- వివిధ శాఖల అధికారుల సమీక్షలో సూచనలు



అధికారులతో సమీక్ష సమావేశంలో పాల్గొన్న కూకట్‌పల్లి జెడ్‌సీ వి.మమత, తదితరులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ వి.మమత సోమవారం జోనల్ కార్యాలయంలో విద్యుత్, వాటర్, ట్రాఫిక్ పోలీస్ శాఖల అధికారుల, సీఆర్‌ఎంపీ ఏజెన్సీ, సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జెడ్‌సీ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 11న చేపట్టనున్న 'కమ్యూనిటీ ఎంగేజ్‌మెంట్ – పౌరుల ఫిర్యాదుల పరిష్కారం'కార్యక్రమంపై అవగాహన కల్పించారు. జీహెచ్‌ఎంసీ, పోలీస్, హెల్త్, విద్యుత్, రెవెన్యూ వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో నోడల్ ఆఫీసర్ ఆధ్వర్యంలో టీమ్స్ ఏర్పాటు చేయాలన్నారు. వారికి కేటాయించిన కాలనీ సంక్షేమ సంఘాల సభ్యులతో సమావేశమై చెత్త తొలగింపు, రోడ్లు, వీధి దీపాలు, ఇతర శాఖలకు సంబంధించిన తాగునీరు, చెట్ల పెంపకం, శాంతి భద్రతలు, వరద ముప్పు, నాలాల క్లీనింగ్ వంటి సమస్యలపై ఫిర్యాదులను స్వీకరించి రోజువారీ రిపోర్టులను అందజేయాల్సి ఉంటుందన్నారు.

- కూకట్‌పల్లి జోన్‌కు సంబంధించిన ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల వారీగా అధికారులు మాట్లాడుతూ.. రోడ్డు డివైడర్ల ఎత్తుపెంపుదల, కొత్త రోడ్డు డివైడర్ల నిర్మాణం, ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం, రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభాల తొలగింపు, రోడ్డు వెడల్పు, ట్రాఫిక్ కూడళ్ల అభివృద్ధిపై సమస్యలు జోనల్ కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు.
- ఈ సందర్భంగా జెడ్‌సి మమత మాట్లాడుతూ... శనివారం సర్కిళ్ల వారీగా స్పెషల్ ఫుట్‌పాత్ ఎన్‌క్రోచ్‌మెంట్స్ డ్రైవ్‌ను చేపట్టి ఆక్రమణలు తొలగించాలని ఆదేశించారు. జీహెచ్‌ఎంసీ అధికారులు మాట్లాడుతూ వాటర్ వర్క్స్ సిబ్బంది డ్రైనేజీ లైన్లు నుంచి తీసిన వ్యర్థాలను తొలగించాలని కోరారు. విద్యుత్ శాఖ రోడ్లపై పడవేసిన చెట్ల కొమ్మలను వెంటనే తొలగించాలని తెలిపారు. అదే విధంగా ఆల్వాల్‌లో రోడ్లపై నాటిన మొక్కలను వీధి వ్యాపారులు తొలగించకుండా చర్యలు తీసుకోవాలని ఉపకమిషనర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఉపకమిషనర్లు, అధికారులు, ట్రాఫిక్ పోలీస్, లా అండ్ ఆర్డర్ ఉన్నతాధికారులు, విద్యుత్, వాటర్‌వర్క్స్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

